క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించండి

అంబాజీపేట: పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు, అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావులకు రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ నాయకులు కోరారు. అంబాజీపేట వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో వైశ్య సంఘ సభ్యులతో పార్టీ నాయకులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉంటూ అభివృద్ధికి సహకరిస్తామని వైశ్య సంఘ సభ్యులను కోరారు. తమ వంతు సహాయ సహకారాలు అందించి విప్పర్తి, రాపాకల గెలుపునకు కృషి చేస్తామని వైశ్య సంఘ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, ఉభయగోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, ఉందుర్తి నాగబాబు, అప్పన శ్రీను, కోట సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట యోగా విద్యార్థుల మానవత్వం



అమలాపురంలో రక్తదానం చేస్తున్న యోగా విద్యార్థులతో శ్రీనివాస్

కొత్తపేట: వివిధ వ్యాధులతో బాధపడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన ఆరుగురికి కొత్తపేట వివేకానంద యోగా ఆశ్రమం, హనుమాన్ వ్యాయామ కళాశాల నిర్వాహకుడు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆ విద్యార్థులు 14 మంది రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ రక్తం అవసరమైన వారి బంధువులు యోగా మాస్టర్ ఆకుల శ్రీనివాస్‌ను ఆశ్రయించగా రక్తదాతలు పి.దుర్గ, ఎం.నవీన్, ఎల్.పవన్, కె.సుధీర్, ఎ.శ్రీను, ఎస్.పవన్, ఎస్.కార్తిక్, పి.వెంకన్న, ఎం.దుర్గాప్రసాద్, ఎం.మాధవన్, పి.ఏసురత్నం, ఎ.చంటి, పి.బాబి, కె.దుర్గ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయా రోగుల బంధువులు శ్రీనివాస్‌కు, రక్తదాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా మాతృ పూజోత్సవం

మామిడికుదురు: స్థానిక రుక్మిణి, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయం ప్రాంగణంలో ఆదివారం మాతృ పూజోత్సవం జరిగింది. బాల వికాస్ చిన్నారులు తమ తల్లుల పాదాలు కడిగి మాతృ పూజోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా జరిపించారు. 45 మంది బాల వికాస్ చిన్నారులు, 29 మంది మాతృ మూర్తులు, నలుగురు బాల వికాస్ గురువులు కార్యక్రమంలో పాల్గొన్నారు. పలు పోటీలు నిర్వహించి వాటిలో విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతులు అందించారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడి పెద్దనాన్నకి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శనివారం రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెం గ్రామానికి చెందిన గిద్దా నవీన్ వెంకట్ మునేశ్వర్ వయస్సు ఏడేళ్లు. బ్రెయిన్‌కి రక్తం సరఫరా అయ్యే నరాలు బ్లాక్ కావడంతో చేయి, కాలు పడిపోయాయి. ఈ బాలుడికి తలలో రెండు ఆపరేషన్లు చేయాలి. దానికి రూ.పది లక్షలు వరకు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారు. అంత ఆర్థిక స్తోమత లేని బాలుడి కుటుంబ సభ్యులు స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో రావులపాలెంలో నవీన్ పెద్ద నాన్న వీరబాబుకి సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ.15 వేల నగదు ఆర్థిక సాయంగా అందజేశారు.

ముస్లింలు ఆత్మ విమర్శ చేసుకోవాలి



చైర్మన్ ఖాదిర్

మామిడికుదురు: ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని చెబుతున్న వైఎస్సార్ సీపీ వెంట నడవాలో, అధికారంలోకి వస్తే ఆ రిజర్వేషన్లు రద్దు చేస్తామని చెబుతున్న బీజేపీ వెంట నడుస్తున్న కూటమి వెంట వెళ్లాలో ముస్లింలు నిర్ణయించుకోవాలని అంబేడ్కర్ కోనసీమ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ ఖాదిర్ పిలుపు నిచ్చారు. ఆయన మామిడికుదురులో ఆదివారం మాట్లాడుతూ ముస్లింలను వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్ని విధాలుగా ఆదుకున్నారని, దీన్ని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్నారు. కొంత మంది నాయకులుగా చెబుతున్న ముస్లింలు తమ స్వార్థం కోసం పార్టీని వీడి వెళుతున్నారని, వారి వల్ల పార్టీకి ఏ విధమైన నష్టం లేదన్నారు. ఎందుకు పార్టీలోకి వచ్చారో, ఎందుకు వెళ్లారో వారి అంతరాత్మకే తెలియాలన్నారు. ముస్లింలలో 90 శాతానికి పైగా సీఎం జగన్మోహన్‌రెడ్డి వెంట ఉన్నారని ఖాదిర్ చెప్పారు.

పేదల ఆనందాల లోగిళ్లు

- నియోజకవర్గంలో 17,625 ఇళ్ల పట్టాల పంపిణీ
- దశలవారీగా వైఎస్సార్ జగనన్న కాలనీల నిర్మాణం



ఆలమూరులో రూపుదిద్దుకున్న వైఎస్సార్ జగనన్న కాలనీ

ఆలమూరు: రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ కనీస అవసరాలైన కూడు, గూడు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జనరంజక పాలన సాగిస్తోంది. అందులో భాగంగా ఇళ్లు లేని అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలను మంజూరు చేసి పక్కా ఇళ్లు నిర్మించేందుకు ప్రవేశపెట్టిన 'వైఎస్సార్ జగనన్న కాలనీ–పేదలందరికీ ఇళ్ల నిర్మాణం' నిరుపేదల పాలిట వరంలా మారింది. కొత్తపేట నియోజకవర్గంలో రికార్డుస్థాయిలో 459.64 ఎకరాలు సేకరించి 17,625 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. తొలిదశలో నాలుగు మండలాల్లో వందలాది ఇళ్లను నిర్మించి దశల వారీగా వైఎస్సార్ జగనన్న కాలనీలను చురుగ్గా ఏర్పాటు చేస్తుంది. తొలి దశలో ఆలమూరు, ఆత్రేయపురం మండలాలను ఏర్పాటు చేసిన వైఎస్సార్ జగనన్న కాలనీల్లో రూ 5.4 కోట్ల వ్యయంతో తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, అంతర్గత రోడ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పన జరిగింది. ఆలమూరులో 2022 జూన్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వర్చువల్ విధానంలో కాలనీ ప్రారంభోత్సవం జరిగింది.

నియోజకవర్గంలో 31 లేఅవుట్ల ఏర్పాటు

వైఎస్సార్ జగనన్న కాలనీలను అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో నిర్మించే విధంగా నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ప్రభుత్వం 31 లేఅవుట్లను ఏర్పాటు చేసింది. అలాగే తొలి విడతలో 2040 మందికి గృహ రుణాలు మంజూరు కాగా ఎనిమిది వైఎస్సార్ జగనన్న కాలనీల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అన్ని లేఅవుట్లలోని లబ్ధిదారులకు కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తన సొంత నిధులను వెచ్చించి పసుపు, కుంకుమ, గాజులు, నూతన వస్త్రాలను అందజేసి ఇళ్ల పట్టాలను అందజేశారు. అనంతరం ఇళ్ల స్థలాలను రూ 125 కోట్లతో మెరక చేసి, రహదారులను ఏర్పాటు చేసి లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకునే వీలు కల్పించింది. ఇంటిని నిర్మించుకుంటున్న ప్రతి లబ్ధిదారునికి తమ బ్యాంకు ఖాతాలో రూ.1.80 లక్షల సాయాన్ని అందిస్తుంది. అలాగే డ్వాక్రా సంఘాల ద్వారా, ఎస్ఆర్‌జీఈఎస్ ద్వారా ఆర్థిక సాయం అందించడం ద్వారా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు సహాయ సహకారాలను ప్రభుత్వం మెండుగా అందిస్తుంది. ఇప్పటికే నియోజకవర్గంలో వందలాది మంది లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేయగా మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. నిర్మాణాన్ని స్థితిని బట్టి ప్రభుత్వ సాయాన్ని లబ్ధిదారుని ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుంది. దీనికి అదనంగా రాయితీపై డ్వాక్రా రుణం ప్రభుత్వం సమకూర్చుతుంది.

నియోజకవర్గంలో ఇలా..

మండలం పేరు	ఇళ్ల స్థలాలు	గృహ రుణాలు	లే అవుట్లు	జగనన్న కాలనీలు
ఆలమూరు	4623	410	11	03
ఆత్రేయపురం	3965	392	09	02
రావులపాలెం	4498	593	04	01
కొత్తపేట	4539	645	07	02
	17625	2040	31	08

వైఎస్సార్ సీపీలోనే పేదలకు న్యాయం

వైఎస్సార్ సీపీ అధికారంలోకి మరోసారి రావడం ద్వారా ఇళ్ల పట్టాల లబ్ధిదారులందరూ సొంతింటికి యజమానులు అవుతామని అభిప్రాయపడుతున్నారు. పేదల అభ్యున్నతికి, ఆర్థిక స్వావలంబనకు అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం జగన్ మళ్లీ అధికారం చేపట్టవలసిన ఆవశ్యకత రాష్ట్రంలో నెలకొని ఉందని నియోజకవర్గ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. ఏళ్ల తరబడి అద్దె ఇళ్లల్లో నివసిస్తున్న తమ ఇబ్బందులను గుర్తించి వ్యయ ప్రయాసలకోర్చి ఇళ్ల స్థలాలను మంజూరు చేయడంతో పాటు గృహాలను నిర్మించే బాధ్యత తీసుకుని ప్రభుత్వం తమకు అండగా ఉండటం పట్ల లబ్ధిదారులంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

దశల వారీగా అర్హులకు గృహాలు నిర్మిస్తున్నాం



మండలంలో తొలివిడత మంజూరైన ఆలమూరు, నర్శిపూడి, చింతలూరు గ్రామాల్లో గృహ నిర్మాణాలు పూర్తికాగా లబ్ధిదారులు గృహ ప్రవేశాలను జరుపుకున్నారు. అలాగే మండలంలోని మిగిలిన లేఅవుట్లలో దశల వారీగా ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

– దర్నాల శ్రీనివాసు, గృహనిర్మాణశాఖ జేఈ, ఆలమూరు

ఆత్మ విశ్వాసంతో జీవిస్తున్నాం



గత సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గృహాన్ని నిర్మిచడంతో తమ కుటుంబమంతా ఆత్మవిశ్వాసంతో జీవిస్తున్నాం. తమ కాలనీలో అన్ని సౌకర్యాలను కల్పించిన సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

– బి.లక్ష్మీసుధ, లబ్ధిదారు, ఆలమూరు

పేద మహిళల ఆత్మాభిమానాన్ని గౌరవించారు



పేద మహిళనైన తన సొంతింటి కలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చింది. తనకు స్థలం ఇవ్వడంతో పాటు ఇంటిని నిర్మించి ఆత్మాభిమానంతో జీవించేలా సీఎం వైఎస్ జగన్ భరోసా కల్పించాడు. రూ.లక్షల విలువైన ఆస్తికి ప్రభుత్వం యజమానురాలును చేసింది.

– ఎస్.అనంతలక్ష్మి, లబ్ధిదారు, ఆలమూరు.

సంక్షేమం కావాలంటే వైఎస్సార్ సీపీ రావాలి



పెదపట్నంలంకలో ప్రచారం నిర్వహిస్తున్న విప్పర్తి సతీమణి అంజలి

మామిడికుదురు: పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు కావాలంటే వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలని పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు సతీమణి అంజలి, కోడలు జమీమా కోరారు. పెదపట్నంలంక, పెదపట్నం గ్రామాల్లో ఆదివారం ఇద్దరూ విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి మీ ఆడపడుచుగా తనను ఆదరించాలని, ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే విప్పర్తి వేణుగోపాలరావుకు తోడుగా నిలవాలని కోరారు. కేవలం అధికారమే పరమావధిగా జట్టు కట్టిన కూటమి అభ్యర్థులకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. మీ చల్లని దీవెనలు జగన్ సర్కారుపై చూపించి మళ్లీ జగన్ సీఎం అయ్యే బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రచారంలో ఆమె వెంట నగరం ఏఎంసీ వైస్ చైర్మన్ కొమ్ముల సత్యామణి, కొమ్ముల చిన్న, యేడిద లక్ష్మణరావు, కొమ్ముల శ్రీను, జక్కంపూడి వాసు, నీతిపూడి నరేష్, గోగి రామ్మూర్తి, యనమదల సత్యనారాయణ, చింతా శ్రీను, యేడిద నాయుడు పాల్గొన్నారు.

నేడు మండల సర్వ సభ్య సమావేశం

ఆలమూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం జరగనుందని ఎంపీడీఓ ఎ.మేరీ రోజ్ తెలిపారు ఈసందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడుతూ ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని ఆమె సూచించారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

మంచి చేశాం.. మళ్లీ మీ ముందుకు వస్తున్నాం



ఈతకోటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి

- ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి
- గోపాలపురం, కొమరాజులంక, ఈతకోటల్లో ఎన్నికల ప్రచారం

రావులపాలెం: మంచి చేశాం మళ్లీ మీ ముందుకు వస్తున్నాం అంటూ వైఎస్సార్ సీపీ కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గోపాలపురం, కొమరాజులంక, ఈతకోట గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గోపాలపురంలో అరుంధతిపేట, సిద్ధార్థ నగర్‌లోను, కొమరాజులంక రజకుల వినాయకుడి గుడి వద్ద నుంచి, ఈతకోట గ్రామంలో హైవే వద్ద కనకదుర్గమ్మ ఆలయం వద్ద నుంచి ఎన్నిలక ప్రచారాలను మొదలుపెట్టారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించామని, గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు అందించామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరలా అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతీ గ్రామంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పనిచేసి చూపించామన్నారు. ప్రజలు జరిగిన మంచిని గమనించి మంచి చేసే జగనన్న ప్రభుత్వానికే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరలా పట్టం కట్టాలని కోరారు.

వాడపాలెం, పలివెలలో విస్తృత ప్రచారం

కొత్తపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల మొత్తాన్ని పెంచి కొనసాగించడంతో పాటు మరిన్ని వినూత్న పథకాలు అమలు కావాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీకే పట్టం కట్టాలని ఎమ్మెల్యే, నియోజకవర్గ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సాయంత్రం మండలంలోని వాడపాలెం, పలివెల గ్రామాల్లో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. ముందుగా ఆయా గ్రామాలకు చేరుకున్న జగ్గిరెడ్డికి పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. వాడపాలెంలో పెదపేట నుంచి, పలివెలలో వంతెన నుంచి జగ్గిరెడ్డి ప్రచారం ప్రారంభం కాగా అక్కడి నుంచి అడుగడుగునా ప్రజలు స్వాగతం పలికారు. ఈ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సీఎం జగన్ నాయకత్వం అవసరాన్ని ఎక్కడికక్కడ అందరూ గుర్తించారన్నారు. దానికి నిదర్శనమే వైఎస్సార్ సీపీకి లభిస్తున్న ఆదరణ అని అన్నారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, జిల్లా పార్టీ సభ్యుడు బండారు కృష్ణమూర్తి, ఎంపీటీసీలు నేలపూడి భీమరాజు, గునిపే శ్యామల, మండల ఏఏబీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షుడు మట్టా బాబ్జి, తులా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పథకాలు అమలు చేసిన జగన్‌ను ఆశీర్వదించాలి



నాగుల్లంకలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు

పి.గన్నవరం: దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేసి చరిత్ర సృష్టించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర ప్రజలంతా ఆశీర్వదించాలని పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని నాగుల్లంక, కె.ముంజవరం గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి, ఓటర్లను కలుసుకున్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి తనను, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావును గెలిపించాలని విప్పర్తి కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లు అనేక కుట్రలు పన్ని, అడ్డంకులు కల్పించినా.. ప్రజా సంక్షేమం కోసం జగన్ నిరంతరం శ్రమించారని వివరించారు. చంద్రబాబు, పవన్‌లు జగన్‌పై లేని పోని అబద్ధాలు చెబుతూ దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. 2014 మాదిరిగానే మోసపూరిత హామీలతో ప్రజలను మళ్లీ మోసగించేందుకు వస్తున్న కూటమి నేతలకు తగిన బుద్ధి చెప్పాలని విప్పర్తి అన్నారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర రావు, సొసైటీ చైర్మన్ కుంపట్ల గోపి, నాయకులు మంగం శ్రీను, కారుపల్లి శ్రీను, బొక్కా ఏడుకొండలు, చికిలే వెంకటేశ్వరరావు, చింతా రవి, దేశిరాజు సీతారామయ్య, నాగాబత్తుల సూర్యనారాయణ, శృంగవరపు లక్ష్మణరావు, ఎంపీటీసీ కుంపట్ల వీవీ నరసాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేసింది.. చేయబోయేది జగనే



రామేశ్వరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: రాష్ట్ర ప్రజలకు ఇప్పటి వరకూ మేలు చేసింది, భవిష్యత్తులో మేలు చేయబోయేది కూడా సీఎం జగన్ మాత్రమేనని వైఎస్సార్ సీపీ రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు, పార్లమెంట్ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని చింతలమోరిలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఇరువురూ పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి ఓటు వేసి జగన్‌ని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కష్ట పడాలని సూచించారు. బోగస్ ఎన్నికల హామీలతో గ్రామాల్లోకి వస్తున్న కూటమి నాయకులను నమ్మ వద్దని కోరారు. ఇప్పుడున్న ప్రజా సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనే సీఎం కావాలని అన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పార్టీ సీనియర్ నాయకులు బొంతు రాజేశ్వర రావు, బోనం వెంకట రామారావు, కందుల విజయ కుమార్, సర్పంచ్ కాకర శ్రీనివాస్, తోటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాను తుపానులో కూటమి కొట్టుకుపోవడం ఖాయం

సఖినేటిపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభంజనంలో ప్రతిపక్ష కూటమి కొట్టుకుపోవడం ఖాయమని ఆ పార్టీ రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం రామేశ్వరంలో ఇంటింటికీ ఎన్నికల ప్రచారాన్ని ఆయన నిర్వహించారు. ఎన్నికల మేనిఫెస్టోను, ఈవీఎం నమూనా బ్యాలెట్‌ను అందజేశారు. కోవిడ్ సంక్షోభంలోనూ రెండేళ్లు ఏ పథకాన్ని సీఎం జగన్ ఆపలేదన్నారు. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా సీఎం జగన్ సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. కాగా టీడీపీ మేనిఫెస్టో అబద్ధాల పుట్ట అని, పొరపాటున బాబుకు ఓటేస్తే మళ్లీ చీకటి రోజులు వస్తాయన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా రాపాక వరప్రసాదరావుకు ఫ్యాన్ గుర్తులపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, సర్పంచ్ కట్టా ఉమామహేశ్వరరావు, నాయకులు పాటి శివ కుమార్, సరెళ్ల విజయ్ ప్రసాద్, ఈద రవిరెడ్డి, చెల్లింగి నాగరాజు, బళ్ల లక్ష్మణ్ పాల్గొన్నారు. అలాగే మండలంలోని టేకిశెట్టిపాలెంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు జిల్లెళ్ల ఆనంద్ ఆధ్వర్యంలో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు చేశారు. బూత్ స్థాయి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



చింతలమోరి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు

జగన్ పాలనలో ఇంటింటికీ సంక్షేమ లబ్ధి



మాచవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ నాయకులు

అంబాజీపేట/సఖినేటిపల్లి/అయినవిల్లి/మామిడికుదురు: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, పేరి శ్రీనివాస్‌లు అన్నారు. అంబాజీపేట మండలంలోని ఆయా గ్రామాల్లో పార్టీ మండల శాఖ అధ్యక్షుడి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎన్నికల ప్రచారాన్ని శనివారం జోరుగా నిర్వహించారు. సఖినేటిపల్లిలో ఇంటింటికీ జగన్ కోసం సిద్ధం కార్యక్రమాన్ని ఆదివారం బూత్ స్థాయి కమిటీల సభ్యులు ఎన్నికల ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని, మళ్లీ జగనన్నను సీఎం చేయండి అంటూ గడప గడపకు ఎన్నికల ప్రచారం చేశారు. అంతర్వేది దేవస్థానంలో సర్పంచ్ కొండా జాన్‌బాబు, పార్టీ సీనియర్ నాయకుడు నల్లి డేవిడ్ ప్రచారం చేశారు. అయినవిల్లిలో వైఎస్సార్ సీపీ గుర్తు ఫ్యాన్ గాలికి కూటమి అభ్యర్థులు చిత్తుగా ఓడి తీరాల్సిందేనని స్థానిక ఎంపీపీ మట్టపర్తి నాగ విజయలక్ష్మి అన్నారు. ఆదివారం విలసలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మామిడికుదురులో వైఎస్సార్ సీపీ సైన్యం ప్రచారాన్ని హోరెత్తిస్తోంది. నగరంలో ముస్లింలు, మామిడికుదురు, పెదపట్నం, మొగలికుదురు, అప్పనపల్లి, పాశర్లపూడి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, ఆదుర్రు గ్రామాల్లో గత మూడు రోజుల నుంచి ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు.

వలసలతో ప్రతిపక్షాల ఖాళీ

ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి జగ్గిరెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: ప్రజాదరణతో మళ్లీ అధికారం చేపట్టనున్న వైఎస్సార్ సీపీలోకి వలసల వెల్లువతో టీడీపీ, జనసేన పార్టీలు ఖాళీ అయిపోతున్నాయని ఎమ్మెల్యే, అసెంబ్లీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని వాడపాలెం గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు నక్కా రమేష్, ఉరం వేణుబాబు ఆ పార్టీకి రాజీనామా చేసి, స్థానిక నాయకులతో కలసి గోపాలపురం వెళ్లి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారు మాట్లాడుతూ బూటకపు హామీలు, కుట్రలు, కుతంత్రాలతో నిండిన టీడీపీతో కలిసి పనిచేయడం ఇష్టం లేక జనసేన నుంచి బయటకు వచ్చామన్నారు. కుల, మత, పార్టీ, వర్గ భేదం చూడకుండా సంక్షేమ పథకాలు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి నాయకత్వం పట్ల ఆకర్షితులై వారితోనే కలిసి నడవాలని నిర్ణయించుకున్నామన్నారు. ఇక్కడ జగ్గిరెడ్డి విజయానికి మా వంతు కృషి చేస్తామన్నారు. వారికి జగ్గిరెడ్డి కృతజ్ఞతలు తెలియజేస్తూ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, పచ్చిపులు గుప్త, జీవీకే పాల్గొన్నారు.

కేతరాజుపల్లిలో..

రావులపాలెం: టీడీపీ అంటే అమలు సాధ్యం కాని హామీలు, అవినీతి, జన్మభూమి కమిటీల అరాచకాలు అని, అలాంటి పార్టీలో మేము కొనసాగలేం అంటూ రావులపాలెం మండలం కేతరాజుపల్లి గ్రామానికి చెందిన పలువురు ఆ పార్టీకి రాజీనామా చేసి ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన పమ్మి నాగమణి, నందమూరి ఊహ, నక్కా బేబీ, సాదవాసు నవ్య, మట్టా ఆదిలక్ష్మి, పమ్మి సత్యశ్రీ , భట్నవిల్లి పుష్పకిషోర్, కొప్పిశెట్టి మోషే, గుబ్బల కల్యాణ్, వాసు తదితరులు కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి జగ్గిరెడ్డి సాదరంగా ఆహ్వానించారు.

పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రం సందర్శన



రాజోలులో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రం సందర్శించిన రాపాక వరప్రసాదరావు

రాజోలు: నియోజకవర్గ కేంద్రం పరిధిలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే ఉద్యోగులను అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు ఆదివారం ఓట్లు అభ్యర్థించారు. రాజోలులోని రోటరీ భవనంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని రాపాక సందర్శించారు. ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారన్నారు. రాపాక మాట్లాడుతూ అన్ని వర్గాలతో పాటు ఉద్యోగుల సంక్షేమాన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగుల భద్రత, సంక్షేమంపై దృష్టి సారించిందన్నారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డిని విజయపథంలో నిలపాలని కోరారు. పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, జిల్లా మహిళా అధ్యక్షురాలు మునికుమారి, సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, మాజీ సర్పంచ్ మట్టా కృష్ణకుమారి, మట్టా ఏడుకొండలు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ఉద్యోగులు

సార్వత్రిక ఎన్నికల పురస్కరించుకుని ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు ఆదివారం రాజోలులోని రోటరీ భవనంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఫెసిలిటేషన్ సెంటర్ పరిశీలించిన కలెక్టర్

కొత్తపేట: జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరయ్యే వారందరూ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షుశుక్లా అన్నారు. పీఓ, ఏపీఓ, ఓపీఓలుగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులకు ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. ఆ మేరకు నియోజకవర్గానికి ఒక ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. కొత్తపేట నియోజకవర్గానికి సంబంధించి స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను ఆదివారం మధ్యాహ్నం కలెక్టర్ శుక్లా పరిశీలించారు.